## వక్ఫ్

## ١٧ - بَابُ الوَقْفِ

785. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రబోధించారని హజ్రత్ అబూ హురైర (రజి) ఉల్లేఖించారు - మానవుడు చనిపోయినంతనే అతని కర్మల పరంపర తెగిపోతుంది. అయితే మూడు కర్మల ఫలం మాత్రం మరణానంతరం కూడా అతనికి లభిస్తూ ఉంటుంది. (1) ఎడతెగని దానం (సదఖా). (2) నిత్యం ప్రయోజనం చేకూర్చే విద్య. (3) మృతుని మన్నింపుకై వేడుకుంటూ ఉండే సజ్జన సంతానం.

(٧٨٥) عَنْ أَبِي هُرَيْرَةَ رَضِيَ اللهُ تَعَالَى عَنْهُ، أَنَّ رَسُولَ اللهِ ﷺ قَالَ: «إِذَا مَاتَ الإِنْسَانُ انْقَطَعَ عَنْهُ عَمَلُهُ، إِلاَّ مِنْ ثَلاَثَةٍ: صَدَقَةٍ جَارِيَةٍ، أَوْ عِلْمٍ يُنْتَفَعُ بِهِ، أَوْ وَلَدٍ صَالِحٍ يَدْعُو لَهُ». رَوَاهُ مُسْلِمٌ.

### సారాంశం

చనిపోయిన తరువాత కూడా మృతునికి అతని సత్కర్మల పుణ్యఫలం చేరుతూ

ఉంటుందని ఈ హదీసు ద్వారా స్పష్టమవుతున్నది. ఈ హదీసులో మూడు సత్కర్మలు ప్రస్తావించబడ్డాయి.

ఒకటి : ఎప్పుడూ ఎడతెగకుండా కొనసాగే దానధర్మాలు (సదఖయె జారియా). అంటే ప్రజా సంక్షేమాన్ని కోరుకుంటూ వక్ఫ్ చేయబడే ఆస్తులు. ఉదాహరణకు : బాటసారుల కోసం విశ్రాంతి నిలయాలను నిర్మించటం, బావులు త్రవ్వించటం, పంపుసెట్లు, కుళాయిలు వేయించటం, మస్జిదులను నిర్మించటం, ఆసుపత్రుల్ని నెలకొల్పటం, రోడ్లు వంతెనల నిర్మాణాన్ని చేపట్టడం - ఇత్యాదివన్నీ మనిషి తన జీవితంలో చేసుకుంటే మరణించిన తరువాత కూడా వాటి పుణ్యఫలం అతనికి చేకూరుతూ ఉంటుంది.

రెండు : ప్రయోజనకరమైన విద్యా శిక్షణ. జనులకు ధార్మిక విద్యను బోధించటం, విద్యనార్జించే ఏర్పాట్లు చేయటం, పేద విద్యార్థుల విద్యా విషయక ఖర్చుల్ని భరించటం, రచనా ప్రక్రియను కొనసాగించే వ్యవస్థను నెలకొల్పటం, విద్యాలయాలను స్థాపించటం, ధార్మిక గ్రంథాల ప్రచురణకై ఏర్పాట్లు చేయటం మొదలగువన్నీ ప్రయోజనకరమయిన విద్య క్రిందికే వస్తాయి.

మూడు : సజ్జన సంతానం. సజ్జన సంతానంలో కొడుకులు, కూతుళ్లు, మనవళ్లు, మనవరాళ్లు మాత్రమేగాక శుభాత్మల సహచర్యం కోసం ఆరాటపడుతూ వచ్చి శిక్షణ పొందిన శిష్యులు కూడా ఈ జాబితాలోకి వస్తారు. వారికి గనక శిక్షణ ఇచ్చి, మార్గభ్రష్టత నుంచి కాపాడి సన్మార్గంలో పయనింపజేసినట్లయితే ఈ సజ్జన సంతానం మృతుని మన్నింపు కోసం నిష్కల్మషమైన విశ్వాసంతో నిజప్రభువును వేడుకుంటుంది. పరలోకంలో ఉన్నత సోపానాలను ప్రసాదించమని ప్రార్థిస్తుంది. మృతుడు తన ప్రాపంచిక జీవితంలో చేసుకున్న ఈ సదాచరణల సత్ఫలితం అతనికి పరలోకంలో ఎడతెగకుండా చేరుతూ ఉంటుంది.

786. హజ్రత్ ఇబ్నె ఉమర్ (రజి) కథనం: (నా తండ్రి) హజ్రత్ ఉమర్ (రజి)కు ఖైబర్ ప్రాంతంలో కొంత భూమి లభించింది. దీనికి సంబంధించి దైవ ప్రవక్త (సఅసం)ను సంప్రతించే ఉద్దేశ్యంతో (నా తండ్రిగారైన) హజ్రత్ ఉమర్ (రజి) ఆయన (స) వద్దకు వచ్చారు. "ఓ దైవప్రవక్తా (స)! నాకు ఖైబర్‌లో కొంత భూమి లభించింది. చాలా ఖరీదైన, సారవంతమైన భూమి అది. ఇంతకు ముందెన్నడూ నాకు

(٧٨٦) وَعَنِ ابْنِ عُمَرَ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُمَا، قَالَ: أَصَابَ عُمَرُ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُ أَرْضاً بِخَيْبَرَ، فَأَتَى النَّبِيَّ ﷺ يَسْتَأْمِرُهُ فِيهَا، فَقَالَ: يَا رَسُولَ اللّٰهِ! إِنِّي أَصَبْتُ أَرْضاً بِخَيْبَرَ، لَمْ أُصِبْ مَالاً قَطُّ هُوَ أَنْفَسُ عِنْدِيْ مِنْهُ، قَالَ: إِنْ شِئْتَ حَبَسْتَ أَصْلَهَا،

وَتَصَدَّقْتَ بِهَا، قَالَ: فَتَصَدَّقَ بِهَا عُمَرُ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ، أَنَّهُ لاَ يُبَاعُ أَصْلُهَا، وَلاَ يُورَثُ، وَلاَ يُوهَبُ، فَتَصَدَّقَ بِهَا فِي الْفُقَرَاءِ، وَفِي الْقُرْبَى، وَفِي الرِّقَابِ، وَفِيْ سَبِيْلِ اللهِ، وَابْنِ السَّبِيْلِ، وَالضَّيْفِ، لاَ جُنَاحَ عَلَى مَنْ وَلِيَهَا أَن يَأْكُلَ مِنْهَا بِالْمَعْرُوفِ، وَيُطْعِمَ صَدِيْقاً، غَيْرَ مُتَمَوِّلٍ مَالاً. مُتَّفَقٌ عَلَيْهِ، وَاللَّفْظُ لِمُسْلِمٍ.

ఇటువంటి భూమి ప్రాప్తించలేదు. నేనీ భూమిని దానంగా ఇవ్వదలిచాను" అని విన్నవించుకున్నారు. దానికి ఆయన (స), "నీవు కోరుకుంటే అసలును నీ దగ్గరే వుంచుకుని, ఫలసాయాన్ని దానంగా ఇస్తూ ఉండవచ్చు" అని సలహా ఇచ్చారు. ఉల్లేఖకుని కథనం ప్రకారం హ్రజత్ ఉమర్ (రజి) ఈ భూమిని నిరుపేదల, బంధువుల కోసం, బానిసల విముక్తి కోసం, దైవమార్గం కోసం, బాటసారుల కోసం, అతిథి మర్యాదకోసం వక్ఫ్ (అంకితం) చేశారు. వాటి పర్యవేక్షకుడు ధర్మసమ్మతమైన రీతిలో తన స్వయం కోసం కొంత ఖర్చు పెట్టుకోవచ్చనీ, తన స్నేహితులకూ కొంత పెట్టవచ్చనీ వసీయతు కూడా చేశారు. అయితే సొమ్మును నిలువచేసి ఉంచరాదని షరతు విధించారు.

وَفِي رِوَايَةٍ لِلْبُخَارِيِّ: تَصَدَّقَ بِأَصْلِهَا: لاَ يُبَاعُ، وَلاَ يُوهَبُ، وَلٰكِن يُنْفَقُ ثَمَرُهُ.

(బుఖారీ, ముస్లిం - వాక్యాలు మాత్రం 'ముస్లిం'లోనివి. బుఖారీలోని వాక్యాలు ఈ విధంగా ఉన్నాయి - "అసలును దానంగా ఇచ్చారు. అంటే వక్ఫ్ చేశారు. దాన్ని అమ్మనూ రాదు. కానుకగా ఇవ్వనూ రాదు. అయితే దాని ఫలసాయం మాత్రం దైవమార్గంలో ఖర్చుపెట్టబడు తుంది."

**సారాంశం**

ఆ భూమిని ఇతరులకు విక్రయించటంగానీ, కానుకగా ఇవ్వటం గానీ చేయరాదని హదీసులో చెప్పబడింది. అంటే ఒకసారి వక్ఫ్ చేయబడిన ఆస్తిని వేరొకరికి అమ్మకూడదు.

కానుక రూపంలో కూడా ఇవ్వకూడదు. హదీసు వెలుగులో బోధపడేది మాత్రం ఇదే. అయితే ఇమామ్ అబూ హనీఫా (రహ్మ.లై) మాత్రం; వక్ఫ్ ఆస్తిని అమ్మవచ్చు అని అభిప్రాయపడ్డారు. దీని గురించి ఆయన ప్రియశిష్యులైన ఇమామ్ అబూ యూసుఫ్ (రహ్మ.లై) ఏమంటున్నారో చూడండి: "ఈ హదీసు గనక ఇమామ్ అబూ హనీఫా (రహ్మ.లై) దృష్టికి వచ్చి ఉంటే, బహుశా ఆయన తన అభిప్రాయాన్ని మార్చుకునేవారేమో!"

(٧٨٧) وَعَنْ أَبِي هُرَيْرَةَ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُ، قَالَ: بَعَثَ رَسُولُ اللّٰهِ ﷺ عُمَرَ عَلَى الصَّدَقَةِ، اَلْحَدِيثَ، وَفِيهِ «فَأَمَّا خَالِدٌ، فَقَدِ احْتَبَسَ أَدْرَاعَهُ وَأَعْتَادَهُ فِي سَبِيلِ اللّٰهِ». مُتَّفَقٌ عَلَيْهِ.

787. హజ్రత్ అబూహురైర (రజి) కథనం: దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) హజ్రత్ ఉమర్ (రజి)ను సదఖాల (జకాత్ మరియు ఇతర దాన ధర్మాల) వసూళ్ళకై నియమించి పంపారు. (అల్ హదీస్) "ఖాలిద్ (రజి) అయితే తన కవచాలన్నింటినీ దైవ మార్గంలో వక్ఫ్ చేశాడు కదా!" అని ఇందులో (హదీసులో) వచ్చింది.

(బుఖారీ, ముస్లిం)

## సారాంశం

పూర్తి హదీసు ఇలా వుంది : ఇబ్నె జమీల్, ఖాలిద్ బిన్ వలీద్, దైవప్రవక్త (సఅసం) పినతండ్రి అయిన అబ్బాస్ బిన్ అబ్దుల్ ముత్తలిబ్‌లు జకాత్‌ను చెల్లించలేదు. వీళ్లను గురించి చెబుతూ దైవప్రవక్త (స), "ఇబ్నె జమీల్ ఒకప్పుడు నిరుపేదగా ఉండేవాడు. దేవుడు అతన్ని ధనికునిగా చేయగా ఇప్పుడతను పగ తీర్చుకుంటున్నాడు. ఇక ఖాలిద్ (రజి) అంటారా, మీరు అతని యెడల అన్యాయంగా ప్రవర్తిస్తున్నారు. అతనైతే తన కవచాలన్నింటినీ దైవమార్గంలో అర్పించాడు. అబ్బాస్ (రజి) గురించి ఇక చెప్పేదేముందీ! ఆయన (రజి) పై ఉన్న జకాత్‌ను చెల్లించే బాధ్యత నాది. ఫర్జ్‌గా చెల్లించవలసిన జకాత్‌తో పాటు, రెట్టింపు అదనంగా కూడా ఇస్తాను" అని అన్నారు.

## హదీసు ఉల్లేఖకులు

ఖాలిద్ (రజి). మారు పేరు అబూ సులైమాన్. వంశపరంపర ప్రకారం - ఖాలిద్ బిన్ వలీద్ బిన్ ముగీరా మఖ్జూమీ ఖురషీ. తల్లి పేరు అస్మా. ఆమె లుబాబా సుగ్రాగా కూడా పిలువబడేవారు. ఈమె హారిస్ కూతురు. హజ్రత్ ఖాలిద్ (రజి) మక్కా విజయానికి పూర్వం- హిజ్రీ 8లో - ఇస్లాం స్వీకరించారు. మరో కథనం ప్రకారం హిజ్రీ 5వ యేట లేక 6వ యేటలో ముస్లిం అయ్యారు. మక్కా విజయం, హునైన్ యుద్ధం, తబూక్ పోరాటంలో పాల్గొన్నారు. మౌతా యుద్ధం జరిగిన రోజు ఆయన చేతులపై తొమ్మిది ఖడ్గాలు విరిగాయి. దైవప్రవక్త

(స) ఈయనకు 'సైఫుల్లాహ్' (దేవుని కరవాలం) అనే బిరుదు నిచ్చారు. హ॥జత్ అబూబకర్ (రజి) తన పరిపాలనా కాలంలో మార్గభ్రష్టతా ఉపద్రవం పుట్టినపుడు ఈయన్ని అధికారిగా నియమించారు. ఆ తరువాత పారసీకులను ఎదుర్కొన్నారు. అనంతరం ఈయన్ని సిరియా వైపునకు పంపగా, సిరియాలోని పెక్కు ప్రాంతాల్లో విజయ పతాకం ఎగురవేశారు. హ॥జత్ ఉమర్ (రజి) ఈయనకు ఉద్వాసన పలికే వరకూ సేనాధిపతిగా కొనసాగారు. పదవీచ్యుతులైన పిదప 'హిమ్స్'లో స్థిరపడ్డారు. ఆఖరి ఘడియ వరకూ హిమ్స్‌లోనే ఉన్నారు. హి॥జ్రీ 21లో శాశ్వతంగా కన్నుమూశారు. 'హిమ్స్'కు ఒక మైలు దూరంలో వున్న ఒక పేటలో ఈయన అంత్యక్రియలు జరిగాయి.